
సాక్షి తిరుపతి

మంగళవారం ।4। నవంబర్ ।2025



శ్రీవారి సేవలో మఠాధిపతి

నంగునేరిలోని వనమాలి మఠాధిపతి పరమ హంస ఇత్యాది మధురకవి రామానుజ జీయర్ స్వామి శ్రీవారిని దర్శించుకున్నారు. - 8లో



గ్రీవెన్స్.. గందరగోళం

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో మ హిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్ప డడంతో గందరగోళం నెలకొంది. - 8లో



దేవాలయాలపై రాజకీయమా?

రామచంద్రాపురం మండలం రేఖలచేనులో శివాలయం కూల్చివేత ఉత్తర్వులపై భక్తులు మండిపడుతున్నారు. - 8లో



శ్రీకాళహస్తిలో వానలిన వరి పంట



వేరుశనగ పంట

ఫసల్ బీమా లేదు

- 3 సీజన్లుగా అన్నదాతలకు అందని నష్ట పరిహారం
- నీరుగారిన ప్రతిష్టాత్మక పథకం
- సర్కారు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న రైతాంగం

ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం వాటిల్లితే పరిహారం చెల్లించడానికి అమలు చేసిన ఫసల్ బీమా రైతులను ఆదుకోవడం లేదు. కూటమి సర్కారు గద్దెనెక్కిన తరువాత మూడు సీజన్లలో అన్నదాతకు నష్టపరిహారం అందని ద్రాక్షగా మారింది. సర్కారు ప్రీమియం చెల్లించకపోవడం.. రైతులే ప్రీమియం చెల్లించినా కొత్త నిబంధనలు విధించడంతో మట్టిమనిషికి పుట్టెడు దుఃఖం మిగులుతోంది. నేడు ఫసల్ బీమాలో పసలేకుండా పోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



వర్షానికి దెబ్బతిన్న వరి

తిరుపతి అర్బన్ : ఆరుగాలం కష్టించే కర్షకుడిని కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో పండుగలా సాగిన సాగును దండగగా మార్చేస్తోంది. ఈ క్రమంలోనే ప్రతిష్టాత్మక ఫసల్ బీమా యోజన పథకం ఫలాలను అన్నదాతకు అందకుండా అడ్డుపడుతోంది. కనీసం ప్రీమియం సైతం చెల్లించకుండా రైతులపై అదనపు భారం మోపి వేధిస్తోంది. అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో మూడు సీజన్లు గడచిపోయినా నష్ట పరిహారం అందించలేదు. సర్కారు నిర్లక్ష్యం, అధికారుల బాధ్యతారాహిత్యంతో అన్నదాతలకు నష్ట పరిహారం అందని ద్రాక్షగా మారుతోంది.

పంట బీమా ప్రీమియం చెల్లించని ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

ప్రకృతివైపరీత్యాలతో పంటలు దెబ్బతిని, రైతులు నష్టపోతున్నారని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గుర్తించింది. ఆ మేరకు 2022 నుంచి ఫసల్ బీమా ప్రీమియం సొమ్మును రైతుల తరపున ప్రభుత్వమే కంపెనీలకు చెల్లించే విశిష్ట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వరి, వేరుశెనగతోపాటు 12 రకాల పంటలకు ఫసల్ బీమా వర్తింప జేసింది. దీంతో పంట నష్టపోతే వెంటనే పరిహారం ముట్టింది.

కూటమి సర్కారిలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఫసల్ బీమా(పంట బీమా) ప్రీమియం చెల్లించడం కుదరదని తేల్చిచెప్పేసింది. రైతులే ప్రీమియం కట్టుకోవాలని స్పష్టం చేసింది. దీంతో వరి ఎకరాకు రూ.630, వేరుశెనగ ఎకరాకు రూ.450, మామిడి ఎకరాకు రూ.1,750 ప్రీమియం చెల్లించాల్సిన దుస్థితి రైతులకు దాపురించింది. ప్రీమియం కట్టే ఆర్థిక స్తోమత లేక చాలామంది రైతులు బీమా సౌకర్యం పొందలేని పరిస్థితి ఏర్పడింది. వరికి సంబంధించి కేవలం 3.23 శాతం మంది, వేరుశెనగకు 1.12శాతం , మామిడి పంటకు కేవలం ఒక శాతం మంది రైతులు మాత్రమే బీమా కట్టారు. 2024 ఖరీఫ్, 2024-25లో రబీ, ఖరీఫ్ సీజన్లు గడిచాయి. మళ్లీ రబీ సీజన్ మొదలైంది. అయినా ఇప్పటివరకు ఒక రైతుకు కూడా నష్ట పరిహారం ఇవ్వలేదు. దీనిపై ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి ఇంకా జాబితా రాలేదని అధికారులు తెగేసి చెబుతున్నారు.

బీమాలోనూ కొత్త మెలికలు

రైతులు పంటలకు సంబంధించి బీమాకు ప్రీమియం కట్టినా.. ఈకేవైసీ చేయించుకోకుంటే వారికి నష్టపరిహారం ఇవ్వమని ప్రభుత్వం తేల్చిచెప్పేసింది. అంతేకాదు ఒక్కో పంటకు ఒక్కో నిబంధనలు పెట్టింది. వరి పంటకు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకున్నారు. వేరుశెనగ పంటకు మండలాన్ని యూనిట్‌గా తీసుకున్నారు. మామిడికి జిల్లాను యూనిట్‌గా తీసుకున్నారు. దీంతో రైతులు కూడా బీమా నగదు కట్టినా, నష్టం వాటిల్లినా కూటమి పాలనలో ఇచ్చేది ఉండదనే నిర్ధారణకు వచ్చారు.

గాలికి వదిలేసింది



కూటమి ప్రభుత్వం రైతుల బాగోగులను గాలికి వదిలేసింది. నష్టం వస్తే గట్టెక్కడానికి ఉన్న మార్గం పంటలకు బీమా చేయడం. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వమే మా తరపున బీమా ప్రీమియం చెల్లించేది. పంటలు నష్టపోతే మా ఖాతాల్లోకి పరిహారం నగదు జమ చేసేవారు. కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించడం లేదు. మేం ప్రీమియం కట్టినా నష్టపరిహారం అందించడం లేదు. – ఎన్.సుధాకర్‌రెడ్డి, రామిరెడ్డిగారిఇండ్లు, పాకాల మండలం

పరిహారం శూన్యం



నాకున్న రెండెకరాల్లోవరి సాగు చేశా. మోంథా తుపాన్ దెబ్బకు నారుమడి నాశనమైంది. అధికారులు అవగాహన కల్పించక పోవడంతో ఈ-క్రాప్ నమోదు చేయించుకోలేదు. దీంతో పరిహారం రాదంటున్నారు. గత ఏడాది నవంబర్‌లో భారీ వర్షాలకు పంట దెబ్బతింది. అప్పట్లో రూ.37 వేలు నష్టపోయా. అయినా ప్రభుత్వం పరిహారం చెల్లించలేదు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నష్ట పరిహారంతోపాటు, రెండు బస్తాల విత్తనాలను సైతం అందించారు. – కావలి రమణయ్య, గొల్లపాళెం, వాకాడు మండలం

పట్టించుకునేవారేరీ?



గత వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయ సీజన్‌కు ప్రారంభం ముందే రైతులందరికీ ప్రభుత్వమే బీమా ప్రీమియం కట్టేది. దీంతో ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు తక్షణమే పరిహారం అందేది. ఈ ప్రభుత్వంలో రైతులను పట్టించుకునేవారే లేరు. రైతులనే బీమా ప్రీమియం కట్టుకోవాలని చెప్పారు. ఈ విషయంపై ఎవరికీ అవగాహన కల్పించలేదు. దీంతో సకాలంలో రైతులు ప్రీమియం కట్టుకోలేకపోయారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందలేదు.

– కృష్ణారెడ్డి, బుచ్చినాయుడు కండ్రిగ

నట్టేట ముంచింది



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులను నట్టేట ముంచింది. ముందుగా రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసి, పంటల సాగుకు సకాలంలో సలహాలు అందకుండా అడ్డుపడింది. ఇదే సమయంలో బీమా ప్రీమియం భారం కూడా రైతులపైనే వేసింది. ఇప్పుడేమో ఇన్‌పుట్ సబ్సిటీ పొందిన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయమని మెలిక పెడుతోంది. వర్షాలకు పంట నష్టపోతే పరిహారం ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– శంకర్‌రెడ్డి, గురవరాజుపల్లె, రేణిగుంట మండలం

చిన్నచూపు చూస్తున్నారు



కూటమి ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తోంది. గతంలో ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించేది. ఇప్పుడు మేమే కట్టుకోవాలనే విషయం తెలియదు. అధికారులు ఎవరూ మాకు చెప్పలేదు. దీంతో నేను ఈ-క్రాప్ చేయించలేదు. ప్రీమియం కట్టలేదు. ఈ వర్షాలకు 11 ఎకరాల్లో పంట మొత్తం పోయింది. నష్ట పరిహారం రాదంటున్నారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటే కొత్త మెలికలు పెడుతున్నారు. ఇదేం ప్రభుత్వమో మాకు అర్థం కావడం లేదు.

– మధుసూదన్‌రెడ్డి, అమ్మపాళెం, శ్రీకాళహస్తి మండలం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని 6 కంపార్ట్‌మెంట్లలో భక్తులు దర్శనం కోసం వేచి ఉన్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,442 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,692 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.51 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 8 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

ఏపీఆర్ సెట్ ప్రారంభం



ఆన్‌లైన్‌లో ఏపీఆర్ సెట్‌ను ప్రారంభిస్తున్న మహిళా వర్సిటీ వీసీ ఆచార్య ఉమ

తిరుపతి రూరల్: రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ నిర్వహిస్తున్న ఏపీఆర్ సెట్ 2024-25 సోమవారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని 13 కేంద్రాలు, తెలంగాణలో ఒక కేంద్రంలో పరీక్ష ప్రారంభమైనట్టు వర్సిటీ అధికారులు తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం 5,752 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, పరీక్ష 3, 4, 6, 7 తేదీల్లో 7 స్లాట్స్‌గా జరుగుతుందని తెలిపారు. మొత్తం 65 కోర్సులకుగాను ఈ పరీక్ష నిర్వహిస్తున్న ఈ పరీక్షను మహిళా వర్సిటీ వీసీ ఆచార్య వి.ఉమ ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. పరీక్షకు తొలిరోజు 90 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని ఆమె తెలిపారు. ఏపీఆర్ సెట్ 2025 కన్వీనర్ ఆచార్య ఉష, కోకన్వీనర్ ఆచార్య జాన్ సుష్మ పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు.

5న కార్తీక పౌర్ణమి గరుడ సేవ

తిరుమల: తిరుమలలో నవంబర్ 5న కార్తీక పౌర్ణమి గరుడసేవ జరగనుంది. ఆ రోజు రాత్రి 7 నుంచి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్పస్వామి వారు సువర్ణ కాంతులీనుతున్న గరుడునిపై ఆశీనుడై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

జిల్లా యువజనోత్సవ పోటీలు నేడు

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఎల్‌బీసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో మంగళవారం ఉదయం 9 నుంచి జిల్లాస్థాయి యువజనోత్సవ పోటీలు నిర్వహించనున్నట్లు సెట్విన్ సీఈఓ యశ్వంత్ తెలిపారు. శ్రీవివేకానందస్వామి జయంతి సందర్భంగా ఏటా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు చేపడుతూ యువకళాకారుల ప్రతిభను మరింత ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే జిల్లాస్థాయి యువజనోత్సవంలో జానపద బృంద నృత్యాలు, జానపద గీతాలాపన, కవిత్వం , కథ రాయడం, పెయింటింగ్, వివిధ సాంస్కృతిక పోటీలు ఉంటాయని తెలిపారు. 15-29 ఏళ్ల వయస్సు కలిగిన యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను చాటాలని కోరారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు తమ పేరు, పుట్టిన తేదీతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, పోటీలో పాల్గొనే అంశాలతో పోటీలు నిర్వహించే కళాశాల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 83411 11687 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

శెట్టిపల్లెలో త్వరలో ప్లాట్ల కేటాయింపు

తిరుపతి అర్బన్: శెట్టిపల్లిలో త్వరలో ప్లాట్స్, భూముల కేటాయింపు జరుగుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్ తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డితో కలసి అధికారులతో సమీక్షించారు. ప్లాట్ల కేటాయింపులతో పాటు అన్ని వసతులు కల్పించడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రధానంగా తాగునీరు, డ్రైనేజ్, విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మోహన్, జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామకుమార్, జిల్లా సర్వే అధికారి అరుణ్‌కుమార్, తుడా చీఫ్ ప్లానింగ్ అధికారి దేవి కుమారి, తుడా భూ సేకరణ అధికారి సుజన, తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి వాణిశ్రీ, సూర్యనారాయణమ్మ, వాసుదేవనాయుడు ఎస్ఈ కృష్ణారెడ్డి, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్, బిల్డింగ్ ఇన్స్పెక్టర్లు, తుడా సర్వేయర్ దేవానంద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

'డయల్ యువర్ సీఎండీ'కి విశేష స్పందన

తిరుపతి రూరల్: ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి ఏపీఎస్పీడీసీఎల్ తొలిసారిగా నిర్వహించిన 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నవంబరు 3వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సీఎండీ శివశంకర్ తెలిపారు. కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన 'డయల్ యువర్ సీఎండీ'కి తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 87 మంది విద్యుత్తు వినియోగదారులు ఫోన్లు చేసి తమ సమస్యలను నేరుగా సీఎండీకి చెప్పుకున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, గృహాలపై వెళ్లే విద్యుత్ లైన్లు మార్పు, పాఠశాల ప్రాంగణంలో ఉన్న విద్యుత్ లైన్ల మార్పు, కాలిపోయిన/చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పులో జాప్యం, లో ఓల్టేజ్ సమస్యతో విద్యుత్ పరికరాలు కాలిపోవడం, ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంపు, లైన్లు, స్తంభాలు, కాలిపోయిన మీటర్‌ను మార్పు తదితర సమస్యలతోపాటు క్షేత్ర స్థాయిలో పనిచేసే పలువురు ఇంజినీర్లు, సిబ్బందిపై ఫిర్యాదులు చేశారు. విద్యుత్తు వినియోగ దారుల సమస్యలను తెలుసుకున్న సీఎండీ శివశంకర్ సంబంధిత అధికారులతో మాట్లాడి వినియోగదారుల సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం



వినియోగదారులతో మాట్లాడుతున్న సీఎండీ శివశంకర్

ఆయన మీడియాతో మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను స్వయంగా తెలుసుకోవాలన్న ఆలోచనతో 'డయల్ యువర్ సీఎండీ'ని ప్రారంభించామన్నారు. సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో ప్రతి జిల్లాకు ఒక చీఫ్ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్ స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్లుగా నియమించినట్లు తెలిపారు. నోడల్ ఆఫీసర్లు ఆయా జిల్లాల నుంచి వచ్చిన సమస్యలను నోట్ చేసుకుని క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారం అయ్యేంత వరకు స్వయంగా పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు పి.అయ్యూబ్ ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహన్‌రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు పీహెచ్.జానకీరామ్, జె.రమణాదేవి, కె. ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, ఎం.మురళీకుమార్, జనరల్ మేనేజర్లు సీహెచ్ రామచంద్ర రావు, జి.చక్రపాణి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, డి. జగదీష్, తిరుపతి సర్కిల్ ఎస్ఈ చంద్ర శేఖర్ రావు పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తనపై ఆగ్రహం

- పీజీ మొదటి సంవత్సరం విద్యార్థినులకు లైంగిక వేధింపులు
- ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నిరసన
- ప్రొఫెసర్‌తోపాటు సీనియర్లు సైతం ర్యాగింగ్‌కు పాల్పడ్డారని ఆగ్రహం
- అర్ధరాత్రి వరకూ రెక్టార్ చాంబర్‌ను నిర్బంధించిన విద్యార్థులు

రెక్టార్ చాంబర్‌లో బైఠాయించిన విద్యార్థి సంఘాలు

తిరుపతి సిటీ: ప్రొఫెసర్, సీనియర్లు విద్యార్థులు జూనియర్ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఉన్నతాధికారులు చేసిన రాజీ ప్రయత్నాలను తిప్పికొట్టాయి. ఎట్టకేలకు సీనియర్ల సస్పెన్షన్, ప్రొఫెసర్‌పై విచారణ కమిటీ ఏర్పాటుకు హామీతో శాంతించాయి. ఎస్వీయూలో అధ్యాపకుల తీరు మారలేదు. కూటమి ప్రభుత్వ ఏర్పడిన నాటి నుంచి విద్యార్థినులపై లైంగిక వేధింపులు శ్రుతి మించాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఎస్వీయూ జరిగిన ఘటన విద్యార్థి లోకాన్ని భయభ్రాంతులకు గురిచేసింది. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు సైతం వర్సిటీలో ఏమి జరుగుతోందో అర్థం కాక హుటహుటిన వర్సిటీకి చేరుకున్నారు. ఏడాదిగా వర్సిటీలో జరుగుతున్న పరిణామాలు చూస్తే భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

తక్షణం చర్యలు తీసుకోవాలి

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డి విద్యార్థినులపై వేధింపులకు పాల్పడుతున్నారని, సీనియర్ విద్యార్థులతో ర్యాగింగ్ చేయిస్తున్నారని నలుగురు విద్యార్థినులు సోమవారం రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని గుట్టుచప్పుడు కాకుండా పరిష్కరించేందుకు లేడీస్ హాస్టల్ వార్డెన్లను పిలిపించి రాజీ చేయాలన్న ప్రయత్నం జరిగినట్లు సమాచారం. విషయం తెలిసిన విద్యార్థి సంఘాలు రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన ప్రారంభించాయి.

రాజీకి పావులు కదిపిన అధికారులు

ఈ నేపథ్యంలో రెక్టార్ అప్పారావు బాధిత విద్యార్థినులను తన చాంబర్‌లోకి పిలిపించి ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డితో రాజీ చేయించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి సంఘాల నాయకులు రెక్టార్ చాంబర్ తలుపులు పగులగొట్టి లోపలికి దూసుకెళ్లారు. తరువాత రిజిస్ట్రార్, రెక్టార్ విద్యార్థి సంఘాల నాయకులతో సమావేశమై చర్చించారు. సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేస్తూ తక్షణ చర్యలు తీసుకున్నారు. వీసీ ఢిల్లీలో ఉన్నందున రిజిస్ట్రార్ ఆయనతో ఫోన్‌లో మాట్లాడి, ప్రొఫెసర్‌పై విచారణ కమిటీ ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటనపై ఎస్పీకి కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.



సంబంధిత ప్రొఫెసర్‌తో సమావేశమై చర్చిస్తున్న అధికారులు



విద్యార్థి సంఘాలు పగలగొట్టిన రెక్టార్ చాంబర్ తలుపులు

ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేస్తాం

ఢిల్లీ నుంచి బుధవారం వీసీ వచ్చిన తర్వాత కమిటీ ఏర్పాటు చేసి ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డిని సస్పెండ్ చేస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థి సంఘాలు ఆందోళనను విరమించాయి. ఈ ఆందోళన సందర్భంగా పోలీసులతో జరిగిన తోపులాటలో పలువురు విద్యార్థి నాయకులు గాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌యూఐ, ఎన్ఎల్ఎస్ఏ, జీఎస్ఎస్, జేబీఎస్ఎఫ్ నాయకులు రవి, అక్బర్, అశోక్, వినోద్, చలపతి, జెన్నె మల్లికార్జున, సుందర్ రాజు,ప్రేమ్ కుమార్, శివశంకర్ నాయక్, షేక్స, తిరుమలేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకం.. దేదీప్యం





నకార్తీక సమోమాసో అన్నారు పురాణాల్లో.. అంటే కార్తీక మాసాన్ని మించిన మానం మరొకటి లేదని అర్థం. ఈ మాసానికి విశిష్టత ఉంది. ఆస్తికులకెంతో పవిత్రమైంది.. దేవతలం దరికీ ప్రీతికరమైందని చెబుతారు. ఈ క్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీకమాసం రెండో సోమ వారం దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. – శ్రీకాళహస్తి

క్లుప్తంగా

శ్రీవారి సేవలో వనమాలి మఠాధిపతి



వనమాలి మఠాధిపతికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

తిరుమల: నంగునేరిలోని వనమాలి మఠాధిపతి పరమహంస ఇత్యాధి మధురకవి రామానుజ జీయర్ స్వామి సోమవారం శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమల బేడి ఆంజనేయ స్వామి వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తిరుమల శ్రీవారి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

టీటీడీ చైర్మన్‌కే లేని బౌన్సర్లు సురుటుపల్లి చైర్మన్‌కు ఎందుకు?



సురుటుపల్లి ఆలయ కార్యాలయం వద్ద ఉన్న బౌన్సర్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్: నాగలాపురం మండలంలోని సురుటుపల్లి పల్లికొండేశ్వరస్వామి ఆలయం భక్తి క్షేత్రంగా వెలుగొందాల్సిన చోట సోమవారం అధికారదర్పం నిండిపోయింది. ఆలయ దర్శక మండలి చైర్మన్ పద్మనాభరాజు అత్యుత్సాహం భక్తుల మనసులో ఆవేదన రేపింది. ఆయన నేతృత్వంలో సోమవారం జరిగిన ధర్మకర్తల మండలి ఆత్మీయ సమావేశం స్వప్రచార సభగా మారింది. పిచ్చాటూరు నుంచి ర్యాలీగా బయలుదేరిన బృందం సురుటుపల్లికి చేరి, శివాలయ పవిత్రతను ఆర్పాటాల బారున పడేసింది. భక్తి ప్రాంగణంలో బౌన్సర్ల బల ప్రదర్శన చేయించి, భక్తుల భావాలను తునాతునకలు చేసిన చైర్మన్ పద్మనాభరాజుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సురుటుపల్లి చైర్మన్ పదవికే ఇంత హంగామానా? ఇంక టీటీడీ చైర్మన్ పదవి ఇస్తే ఇంకా ఏం చేస్తారో.. ఏమో అని ఆలయానికి వచ్చిన భక్తులు, స్థానిక ప్రజలు గుసగుసలాడుకున్నారు. అంతా చూస్తూ ఆలయ ఈఓ లత మౌనంగా పాటించడం మరింత అనుమానాలకు దారితీస్తుంది. శివాలయం బౌన్సర్ల ప్రాంగణం కాదు. భక్తుల ప్రణామాల పుణ్య క్షేత్రం అని పద్మనాభ రాజు గుర్తించుకోవాలని అంటున్నారు.

దేవాలయాలపై రాజకీయమా?

రామచంద్రాపురం: మండలంలోని రేఖలచేను సమీపంలోని జన్మస్థల శివాలయం కూల్చివేతకు కోర్టు అనుమతి మంజూరు కావడంతో భక్తులు మండిపడుతున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద హిందూ సమాజం భక్తులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వారికి వైఎస్సార్‌సీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి హిందూ దేవాలయాలపై కక్ష ధోరణితో వ్యవహరిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. రామచంద్రాపురం, వెదురుకుప్పం, చంద్రగిరి మండలాల భక్తులు, ప్రజాప్రతినిధులు, పెద్దలు కలిసి తహసీల్దార్, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వ భూమిలో ఉందనే పేరుతో ఆలయాన్ని కూల్చాలన్న నిర్ణయం హిందువుల మనోభావాలను దెబ్బతీస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 500 మంది భక్తులు సంతకాలతో కూడిన వినతిపత్రం సమర్పించగా, ఆలయ ట్రస్టీకు ప్రభుత్వ అధికారులచే నోటీసులు అందినట్లు సమాచారం.

గ్రీవెన్స్.. గందరగోళం



ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న మహిళలు, అడ్డుకుంటున్న పోలీసు



పెట్రోల్ పోసుకున్న వారితో మాట్లాడుతున్న కలెక్టర్

- ఓ వైపు ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నం
- మరోవైపు వైద్యులు పోలీసులు వేధిస్తున్నారంటూ నిరసన
- అనుమతులు తీసుకోవాలంటూ అటెండర్లు హంగామా

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ గందరగోళంగా సాగింది. ఓ వైపు ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, మరో వైపు పోలీసులు వేధిస్తున్నారని నిరసన తెలపడంతో గందరగోళం నెలకొంది. వరుసగా రెండు వారాలు గ్రీవెన్స్ నిర్వహించకపోవడంతో సోమవారం పెద్ద ఎత్తున అర్జీదారులు కలెక్టరేట్‌కు విచ్చేశారు. ప్రజల నుంచి 403 అర్జీలను అధికారులు అందుకున్నారు. కొన్ని సమస్యలకు సంబంధించి ఒక్కొక్క అర్జీకి 100 మంది కూడా విచ్చేశారు. దీంతోనే అర్జీదారుల రద్దీ చోటుచేసుకుంది. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్సీ, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, శివశంకర్ నాయక్, రోజ్‌మాండ్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

అటెండర్ల హంగామా...

కలెక్టర్ సార్‌ను కలవాలంటే ముందుగా అనుమతి తీసుకోవాలని అటెండర్లు వైద్య విద్యార్థులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అర్జీలను ఇవ్వడానికి వచ్చే వారిని ముందుగా ఏ పని కోసం వచ్చారని అటెండర్లు అడుగుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు తమను వేధిస్తున్నారని వైద్య విద్యార్థులు చెప్పడంతో ముందుగా అనుమతి తీసుకోవాలని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎవరైనా అధికారులను కలవచ్చంటూ వారు గట్టిగా మాట్లాడడంతో అటెండర్లు వారిని వదిలిపెట్టారు.

మసీదు వద్ద సమస్యలు సృష్టిస్తున్నారు!

తిరుపతి ఆటోనగర్ మసీద్ వద్ద కొందరు సమస్యలను సృష్టిస్తున్నారని మసీదు కమిటీకి చెందిన పలువురు ముస్లింలు కలెక్టర్‌ను కలిశారు. ఆయనకు ఓ వినతిపత్రం ఇచ్చారు.

దేవాలయాల పై రాజకీయమా?

కూటమి ప్రభుత్వంలో దేవాలయాలపై రాజకీయాలు చేస్తున్నారని చంద్రగిరి మండలంలోని రామచంద్రాపురం, వెదుకుకుప్పం వాసులు ఆవేదన చెందారు. ప్రభుత్వ స్థలంలో ఆలయం ఉందంటూ జన్మస్థల శివాలయం ట్రస్ట్‌కు అధికారులు నోటీసులు ఇవ్వడాన్ని తప్పుపట్టారు. కూటమి నేతలు వేల ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించినా పట్టించుకోని అధికారులు ఆలయాన్ని నిర్మిస్తే అడ్డురావడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఆ మేరకు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు ఓ వినతిపత్రాన్ని అందించారు.

టీడీపీ నేతలు దౌర్జన్యం చేస్తున్నారు!

-ఒంటిపై పెట్రోల్ పోసుకున్న ఇద్దరు మహిళలు

రెండు దశాబ్దాలకు పైగా తిరుపతి సంజయ్‌గాంధీ కాలనీలో తమ అధీనంలో ఉన్న రెండు ఇళ్లను టీడీపీకి చెందిన రజనీకాంత్ అనే నాయకుడు తమ అనుచరులతో దౌర్జన్యం చేస్తున్నారని వెంకట సుబ్బమ్మ, లక్ష్మీదేవి ఆనే ఇద్దరు మహిళలు ఆవేదన చెందారు. సోమవారం కలెక్టరేట్ వద్ద తమ కుటుంబ సభ్యులతో కలసి తమకు న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా ఇద్దరు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే పోలీసులు అడ్డుకున్నారు. గ్రీవెన్స్ ఇన్‌చార్జి జగదీష్ వచ్చి సమస్య ఉంటే పరిష్కరించుకోవాలని, ఇలా ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం సరికాదన్నారు. కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు కూడా ఇచ్చారని చెప్పారు. 20ఏళ్లుగా తహసీల్దార్ ఇచ్చిన ఎంజాయిమెంట్ సర్టిఫికెట్ ఉందని, మున్సిపాలిటీకి పన్ను కడుతున్నట్లు చెప్పారు. డీఆర్వో నరసింహులు గేటు వద్దకు వచ్చి గ్రీవెన్స్‌లో ఉన్న కలెక్టర్ వద్దకు తీసుకు పోయారు. పది నిమిషాల పాటు కలెక్టర్ వారితో మాట్లాడారు. విచారణ చేపట్టి తప్పకుండా న్యాయం చేస్తామని తెలిపారు.

పోలీసులు వేధిస్తున్నారు

ఏ తప్పు చేయకపోయినా లాఠీలతో తమపై వెస్ట్ పోలీసులు దాడులు చేశారని శ్రీవేంకటేశ్వర మెడికల్ కళాశాల విద్యార్థులు మండిపడ్డారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య విద్యార్థులు హరీష్, జయంత్ యాదవ్ ఈ నెల ఒకటో తేదీ రాత్రి విధులు పూర్తి చేసుకుని భోజనం చేయడానికి వెస్ట్ పోలీస్‌స్టేషన్ మీదుగా వెళుతుంటే పోలీసులు బైక్ ఆపి, ప్రశ్నించారన్నారు. తాము మెడికల్ విద్యార్థులమని ఐడీ కార్డులు చూపినా దురుసుగా మాట్లాడడంతో తాము ప్రశ్నించామని పేర్కొన్నారు. దీంతో తమపై దాడి చేశారని వాపోయారు. ఈ విషయమై స్టేషన్‌లో ఎస్ఐకి ఫిర్యాదులు చేస్తే ఆయన కూడా దాడికి పాల్పడ్డారని వాపోయారు. అంతేకాకుండా స్టేషన్‌లో యూనిఫామ్ లేని పలువురు వ్యక్తులు లాఠీలతో తమపై దాడులు చేశారన్నారు. రాత్రి సమయంలో రోడ్లపై ఎందుకు వస్తారంటూ అసభ్యపద జాలంతో దూషించారని పేర్కొన్నారు. రాత్రి తమకు డ్యూటీల నేపథ్యంలో టీ తాగడానికి రోడ్లపైకి వస్తే పెద్ద నేరంగా మాట్లాడుతున్నారని వాపోయారు.



పోలీసులు వేధిస్తున్నారంటూ కలెక్టరేట్ వద్ద మెడికల్ విద్యార్థులు నిరసన

అంగన్‌వాడీలకు డిజిటల్ వెయింగ్ మెషిన్లు

తిరుపతి అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలకు టాటా ట్రస్ట్ సహకారంతో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఐసీడీఎస్ ప్రాజెక్టులకు 734 డిజిటల్ వెయింగ్ మెషిన్ల పంపిణీ చేసింది. సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ఐసీడీఎస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్సీ, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి,టాటా ట్రస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు అమరావతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ పోస్టర్ ఆవిష్కరణ

సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అందించాల్సిన పలు అంశాలను పెద్ద ఎత్తున అవగాహన చేయాలని కలెక్టర్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వసంత బాయి , బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ వసంత డీసీపీఓ శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ వెయింగ్ మెషిన్లతో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు, కలెక్టర్

గుర్తు తెలియని వాహనం ఢీ.. తమిళనాడు వాసి మృతి

చిల్లకూరు: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొని తమిళనాడుకు చెందిన వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని జ్యోతి కాటాకు సమీపంలో రోడ్డు దాటుతున్న తమిళనాడులోని చెన్నై ప్రాంతానికి చెందిన ఏలుమలై(51) అనే లారీ డ్రైవర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే లారీ డ్రైవర్ చెన్నై వైపు వెళుతున్న సమయంలో కాటాకు ఎదురుగా లారీని ఆపి, మద్యం దుకాణానికి వచ్చి లారీ వద్దకు వెళ్లే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెందినట్లు తెలుస్తుంది.



లారీ డ్రైవర్ ఏలుమలై మృతదేహం

మద్యం మత్తులో జారిపడి వ్యక్తి మృతి



మురళీరెడ్డి మృతదేహం

శ్రీకాళహస్తి: మద్యం మత్తులో మిద్దెపై నుంచి జారిపడి మురళీరెడ్డి అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం తన స్నేహితులతో కలిసి పట్టణంలో మద్యం సేవించాడు. ఆ మత్తులో మిద్దెపై నుంచి జారి పడి మృతి చెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు, ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు సైకిల్‌ను ఢీ కొన్న కారు

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు

రాపూరు: వేగంగా వెనుక నుంచి వచ్చి ఆగి ఉన్న మోటారు సైకిల్‌ను కారు ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడిన సంఘటన రాపూరు మండలం సిద్ధవరం గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సిద్ధవరం గ్రామానికి చెందిన మాతంగి వెంకటేశ్వర్లు (25), అతని బావ అంజనీకుమార్ రాపూరుకు వచ్చేందుకు మోటారు సైకిల్‌పై కుర్చుండగా వెంకటగిరి నుంచి అతి వేగంగా వచ్చిన కారు ఆగి ఉన్న మోటారు సైకిల్‌ను ఢీ కొనడంతో మోటారు సైకిల్ వెనుక కూర్చుని ఉన్న మాతంగి వెంకటేశ్వర్లు, అంజనీకుమార్‌కు గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించడంతో 108 వాహనం రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు మృతి చెందాడు. వెంకటేశ్వర్లు తండ్రి కాంతారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నుజ్జునుజ్జయిన మోటారు సైకిల్(ఇన్‌సెట్) వెంకటేశ్వర్లు (ఫైల్)

శ్రీసిటీని సందర్శించిన యూఎన్ విజన్ దౌత్యవేత్త

శ్రీసిటీ (వరదయ్యపాళెం): మాస్కోలోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ ఇన్ఫర్మేషన్ (ఐసీఎస్‌టీఐ) నిపుణుడు, యూఎన్ విజన్ దౌత్యవేత్త జయరాములు లింగుట్ల సోమవారం ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతల గురించి వివరించారు. శాస్త్రీయ ప్రణాళిక, దార్శనిక నాయకత్వంతో రూపొందించిన శ్రీసిటీ, దాని ప్రాంతీయ సామర్థ్యాలను ప్రపంచ స్థాయికి చేర్చిందని ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. ఐసీఎస్‌టీఐ, యునైటెడ్ నేషన్స్ వంటి అంతర్జాతీయ సంస్థలతో కలసి పరిశ్రమ-విద్యా సమన్వయ విధానాలను అభివృద్ధి చేయడం శ్రీసిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. శ్రీసిటీ వేగవంతమైన అభివృద్ధిని ప్రశంసించిన జయరాములు, 31 దేశాలకు చెందిన 245కి పైగా సంస్థలు ఇక్కడ స్థాపించడాన్ని అభినందించారు. అలాగే ట్రిపుల్ ఐటీ, క్రియా యూనివర్సిటీ, ఐఎఫ్ఎంఆర్ బిజినెస్ స్కూల్ వంటి విద్యాసంస్థలతో శ్రీసిటీ విద్యా రంగంలో కూడా విశేష పురోగతి సాధించడాన్ని ఆయన కొనియాడారు. శ్రీసిటీ, పరిశ్రమలు, ప్రభుత్వాలు కలిసి చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ద్వారా స్థానిక యువతకు పరిశ్రమల్లో అవకాశాలు కల్పిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. శ్రీసిటీలోని రష్యన్ కంపెనీ కూబిషెవ్ అజోట్ సహా పలు పరిశ్రమలను ఆయన సందర్శించారు. అంతర్జాతీయ నైపుణ్య విశ్వవిద్యాలయ స్థాపనకు శ్రీసిటీ ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.



జయరాములుకు స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ యువ నాయకులు



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ యువ నాయకులు

చిట్టమూరు: మండలంలోని మేజర్ పంచాయతీ మల్లాంలో పలువురు టీడీపీ యువ నేతలు వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మల్లాం మాజీ సర్పంచ్ దువ్వూరు శేషురెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మల్లాం పంచాయతీ కొక్కుపాళానికి చెందిన టీడీపీ యువ నేతలు కావలి సునీల్, డమ్మాయి ముత్యాలయ్య తమ అనుచరులతో కలసి పార్టీలో చేరారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి దువ్వూరు శేషురెడ్డి పార్టీ కండువాలు కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో మల్లాం పంచాయతీలో టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ సందర్భంగా దువ్వూరు శేషురెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చలేదన్నారు. టీడీపీ తప్పులు ఎత్తి చూపిన వారిపై అక్రమ కేసులు బనాయించి, భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీంతో ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అపార నమ్మకంతో ఆయన్ని 2029 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు వైఎస్సార్‌సీపీలోకి స్వచ్ఛందంగా వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు తిరుమూరు అశోక్, మాజీ సర్పంచ్ చెన్నయ్య, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు నాగరాజు, సునీల్, నరేష్, మీరాజ్ పాల్గొన్నారు.

సివిల్ సర్జన్ పింఛన్‌లో కోత

తిరుపతి తుడా: తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రి విశ్రాంత స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్ డాక్టర్ సీకే రమేష్ కుమార్ పింఛన్‌లో కోత విధిస్తూ ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కర్నూలు జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్గా పనిచేశారు. ఆ సమయంలో ఆయనపై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణ కమిటీని నియమించింది. విచారణలో అర్హత లేని వ్యక్తులను వైద్యులుగా నియమితులయ్యారని, నర్సింగ్ హోమ్‌లు, ఆస్పత్రులు స్థాపించి రోగులకు చికిత్స అందిస్తున్నారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో తేలింది. సర్వీసులో ఉండగా వచ్చిన ఆరోపణలపై సాధారణ క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం ఆయన మూడేళ్ల పింఛన్ 9 శాతం కోత విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

పింఛన్ పునరుద్ధరణకు ఉత్తర్వులు

చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం విశ్రాంత పరిపాలన అధికారి ఎస్.అరుణాచలం పూర్తి పింఛన్ పునరుద్ధరించి బకాయిలతోపాటు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ పేర్కొన్నారు. ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తప్పుడు మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ చేయడంతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలతో ఆయనపై విచారణ జరిపారు. అనంతరం శాశ్వతంగా పింఛన్‌లో 5 శాతం కోత విధించారు. దీనిపై బాధితులు ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు రెండు నెలలలోపు బకాయిలు సహా పింఛన్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

సైబర్ క్రైమ్‌లో 17 లక్షలు మోసం

తిరుపతి క్రైమ్: ఫేస్ బుక్ లో పరిచయం పెంచుకుని ఉద్యోగం ఇప్పిస్తామని ఘరానా మోసానికి పాల్పడిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న ఓ వ్యక్తి ఈ సంవత్సరం జూన్ నెలలో ఫేస్ బుక్ ద్వారా ప్రియా అనే పేరుతో పరిచయమయ్యారు. ఆ వ్యక్తి ద్వారా టెలిగ్రామ్ గ్రూపులకు వాట్సప్ నంబర్లకు ఎస్కార్ట్ సర్వీస్, ప్లే బాయ్ జాబ్ పేరుతో నకిలీ ఉద్యోగాలు ఆఫర్ ఇచ్చి వ్యక్తిని మోసం చేశారు. రిజిస్ట్రేషన్, సెక్యూరిటీ డిపాజిట్, రూమ్ చార్జెస్, జీఎస్టీ అని నమ్మించారు. ఇలా దశల వారీగా మొత్తం 171 సార్లు ఆన్‌లైన్ ద్వారా రూ.17,99,426 దోచుకెళ్లారు. అయితే వారిని తిరిగి డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో ఉద్యోగం కూడా రాకపోవడంతో మోసపోయామని అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 123 అర్జీలు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 123 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు తెలిపారు. ఇందులో చోరీలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ Investment Plots /Farm House Plots / Villa Plots for Sale: Lucky Ventures (India's No.1 Real Estate Company). Contact: 91145 61456.

■ తిరుమలలో అంతర్యాగంగా మరియు పర్యాటక ప్రదేశంగా విరాజిల్లుతున్న చంద్రగిరి Main Townలో Main Road కు ఆనుకొని House-Villa-Guest House-Home Stay & Apartment కట్టుకునే అద్భుతమైన TUDA Approval New Layout (వెంచర్)లో Commercial - Residential - Investment కొరకు 100% వాస్తు Plots అమ్మబడును. సంప్ర॥ 95055 02946

Wanted

■ నవయుగ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో AP ఆగ్రోస్ ప్లాంట్ నందు ఆర్గానిక్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లో మార్కెటింగ్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, వర్కర్స్ యువతి, యువకులు మరియు 65 సం॥లోపు రిటైర్డ్ ఉద్యోగులు కావలెను. Q: 10+2 పైన A: 20-60, జీతం: 15వేలు to 30 వేలు AP ఆగ్రోస్, తిరుచానూరు మ్యాంగో ఫ్రూట్ మార్కెట్, తిరుపతి. www.navayuga.org సంప్ర: 9392877588, 9966211558

■ తిరుపతి APSRTC బస్టాండులోని పార్సిల్ కౌంటర్ నందు పనిచేయుటకు బాయ్స్/గర్ల్స్ కావలెను. సంప్ర. సెల్: 8688818881

■ Work from home మా కంపెనీ అభ్యర్థిత్వాలు మీ మొబైల్ ద్వారా పార్ట్ టైం పద్ధతుకు స్త్రీ/పు. కావలెను. వారానికి 3,500. వివరాలకు వాట్సాప్‌లో hi అని మెసేజ్ పెట్టి కాల్ చేయండి 82478 06801

నాలుగులైన్ల ప్రకటనకు: రూ. 375/-
అదనపు లైనుకు: రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact 9705444178 9951602970

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిలో ఏకీకరించి పరిశీలించిన పిదప ప్రకటనదారులందరిచేతా మీ పాతబాకీ రోజు వైజాగ్ లేదా హైదరాబాద్ లోని మా కార్యాలయాలలో చెల్లించబడుతుంది. ప్రకటనలు నెలలో లేదా